క్లుప్తంగా

ఎరువులు, విత్తనాలను సకాలంలో అందించండి

● ఎమ్మెల్యే పల్లా



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సందీప్‌రెడ్డి

చేర్యాల(సిద్దిపేట): రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను సకాలంలో అందేలా చూడాలని జనగాం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎరువుల వ్యాపారులకు సూచించారు. పట్టణంలోని శ్రీసాయిశివ ఫర్టిలైజర్ దుకాణాన్ని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనను ఫర్టిలైజర్స్ యజమాని, బీఆర్ఎస్ నేత చేతిరెడ్డి సందీప్‌రెడ్డి శాలువాతో సన్మానించారు. అనంతరం పల్లా మాట్లాడుతూ షాపుల యాజమాన్యాలు, అధికారులు రైతులకు విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూడాలన్నారు. రైతులు అధైర్యపడొద్దని, అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. ఆయన వెంట నాగేశ్వర్ రావు, చంటి, రామచంద్రం, మల్లారెడ్డి, రవి, శ్రీను, సంపత్ తదితరులు ఉన్నారు.

పత్తి పంట పరిశీలించిన ఏఓ



పత్తి సాగును పరిశీలిస్తున్న వసంతరావు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల, అలిరాజీపేట గ్రామాల్లో శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వసంతరావు పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిరోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిన్నాయన్నారు. పంట రక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గులాబీరంగు పురుగు నివారణకు లింగార్షక బుట్టలను వాడాలని, వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు పంటలకు మందులను పిచికారీ చేయాలని చెప్పారు.

కల్తీపాల విషయంలో చర్యలేవి?



మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేటకమాన్: కల్తీపాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వినియోగదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణానికి వివిధ గ్రామాల నుంచి కొంత మంది పాలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారని, అయితే కొంత మంది పాలను కల్తీ చేస్తున్నారని వాపోయారు. అలాంటి వారిని సంబంధిత అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న ఏఎస్ఐ రామ్మూర్తి

అక్కన్నపేట(హుస్నాబాద్): సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని, బాలికలను ఆకతాయిలు వేదిస్తే వెంటనే షీటీంలకు సమాచారం అందించాలని ఏఎస్ఐ రామ్మూర్తి చెప్పారు. మండలంలోని కేశవాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సైబర్ నేరాలపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, విద్యార్థుల రక్షణ కోసం షీ టీమ్‌లు ఏర్పాటు చేశామని, ఆపదలో ఉంటే 100నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే 1930నంబర్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పారు. హుస్నాబాద్ షీటీం బృందం సదయ్య, హెడ్ కానిస్టేబుల్స్ కృష్ణ, శివ కుమార్, స్వప్న, ప్రశాంతి, హెచ్ఎం రాజపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జవహర్ నవోదయ విద్యాలయం సహకారంతో సిద్దిపేటలోని ఐఐటీ ఫౌండేషన్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచితంగా ప్రవేశ పరీక్ష మెటీరియల్‌ను శనివారం సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పంపిణీ చేయనున్నట్లు ఐఐటీ ఫౌండేషన్ కోచింగ్ సెంటర్ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పట్టణంలోని ఐఐటీ ఫౌండేషన్ కోచింగ్ సెంటర్‌లో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు ఫోన్: 94938 99544ను సంప్రదించాలని సూచించారు.

కుక్కల సంతానోత్పత్తి ఆగేనా?

దుబ్బాకలో మొదలైన ఆపరేషన్లు

● యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్

● ఒక్కో కుక్కకు రూ.1850 ఖర్చు



కుక్కలను ప్రత్యేక వాహనంలో ఎక్కిస్తున్న సిబ్బంది

ఇటీవల దుబ్బాకలో జరిగిన కుక్కల దాడిలో ఐయ్యంగారి రంగమ్మ(90)తీవ్రంగా గాయపడింది. అర్ధరాత్రి సమయంలో కుక్కలు ఆమె గుడిసెలోకి చొరబడి మంచంపై నుంచి కింద పడేసి తీవ్రంగా గాయపరిచాయి. నియోజకవర్గంలో ఇలాంటి దాడులు దాదాపు 10కి పైగానే జరిగాయి. ఈ దాడులు పునరావృతం కాకుండా ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు దుబ్బాక మున్సిపల్ పరిధిలో కుక్కలకు కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టారు.

సుమారు 265కుక్కలు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలో 20వార్డులు ఉన్నాయి. ముఖ్యంగా దుబ్బాకలో తెలంగాణ తల్లి కూడలి వద్ద, బస్టాండ్‌లో, లాల్ బహదూర్‌శాస్త్రి కూడలి వద్ద, లచ్చపేట చౌరస్తాలో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ తరుచూ వాహనదారులు, ప్రజలపై దాడులు చేస్తున్నాయి. దీంతో మున్సిపల్ అధికారులు తమకు ఫిర్యాదులు వచ్చిన ప్రాంతాలలో ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి కుక్కలను లెక్కించారు. దాదాపు 265 కుక్కలు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

మొదలైన ఆపరేషన్లు

దుబ్బాకలో కుక్కలకు కుటుంబ నియంత్రణ కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు ప్రారంభించారు. కుక్కలను పట్టుకుని ప్రత్యేక వాహనంలో సిద్దిపేట జంతు సంరక్షణ కేంద్రానికి తరలిస్తున్నారు. అక్కడ డాక్టర్ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్లు వేయిస్తున్నారు. అనంతరం వాటిని నాలుగు రోజులు డాక్టర్ పర్యవేక్షణలో ఉంచి తిరిగి దుబ్బాకకు తరలిస్తున్నారు.

ప్రజలకు ఇబ్బందులు రానివ్వం



మున్సిపల్ పరిధిలో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాం. కుక్కలకు సంతానోత్పత్తి కలగకుండా కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయిస్తున్నాం. యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సైతం వేయిస్తున్నాం. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– రమేశ్ కుమార్, మున్సిపల్ కమిషనర్, దుబ్బాక

ఆర్థిక భారంతో నలిగిపోతున్నాం

పంచాయతీ కార్యదర్శుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న కార్యదర్శులు

గజ్వేల్‌రూరల్/దుబ్బాకటౌన్: గ్రామాల్లో చేపట్టిన పనులకు ప్రభుత్వం నుంచి నిధులు, పెండింగ్ బిల్లులు రాకపోవడంతో తమ సొంత డబ్బులను వెచ్చిస్తూ ఆర్థిక భారంతో నలిగిపోతున్నామని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆదుకోవాలని పంచాయతీ కార్యదర్శులు ఎంపీఓకు మొరపెట్టుకున్నారు. పట్టణంలోని ఐవోసీలో ఎంపీవో దయాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగలు ఉన్నందున వాటి నిర్వహణ తమకు మోయలేని భారంగా మారనుందని ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ పనుల కోసం ఖర్చు చేసిన డబ్బులు 10నెలలు గడుస్తున్నా చెక్కులు క్లియర్ కాలేదని, దీంతో గ్రామ పంచాయతీలకు అవసరమైన సామాగ్రిని వ్యాపార, వాణిజ్య ఏజెన్సీలు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని వాపోయారు. కొన్ని నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు సైతం నిలిచిపోయాయని, పారిశుద్ధ్య నిర్వహణకు వినియోగించే ట్రాక్టర్‌కు డీజిల్ కూడా పోయలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి నిధులు, పెండింగ్ బిల్లులు మంజూరయ్యేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అదేవిధంగా దుబ్బాక టౌన్‌లో పంచాయతీ కార్యదర్శుల యూనియన్ రాయపోల్ మండల అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఎంపీఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పరమేశ్, విజయ్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

జగదేవ్‌పూర్(గజ్వేల్): ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన పారిశుద్ధ్య కార్మికుడి కుటుంబానికి పలువురు ఆర్థిక సాయం అందజేశారు. గ్రామానికి చెందిన మాచర్ల మల్లయ్య(50) పంచాయతీలో కార్మికుడిగా పని చేసేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందగా విషయం తెలుసుకున్న ఎంపీడీఓ యాదగిరి, కార్యదర్శి గ్రామానికి చేరుకుని మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించారు. పంచాయతీ తరఫున రూ.10వేలు, కార్యదర్శిల సంఘం తరఫున రూ.6,500 ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి అరుణ్, కార్యదర్శిల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు, కార్యదర్శి పాల్గొన్నారు.

బల్దియా ఎదుట సీఐటీయూ ధర్నా



ఆందోళన చేస్తున్న కార్మికులు

సిద్దిపేటజోన్: రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు, సిబ్బంది ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గోపాల స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ మాట్లాడారు. సిబ్బందిని పర్మినెంట్‌చేసి, కనీస వేతనం, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. అలాగే ప్రమాదాల బారిన పడుతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ రెవెన్యూ అధికారి శ్రీకాంత్‌కు వినతిపత్రం అందించారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్



సిద్దిపేట ఎడ్యుకేషన్: మాట్లాడుతున్న జీవన్‌కుమార్

సిద్దిపేట ఎడ్యుకేషన్: విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ పిలుపునిచ్చారు. కళాశాలలో శుక్రవారం ఉత్సాహంగా ఫ్రెషర్స్ పార్టీని నిర్వహించారు. నూతనంగా కళాశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులను సీనియర్ విద్యార్థులు ఘనంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు, నాటికలు, నృత్యాలు చేశారు. ముఖ్య అతిథిగా హాజరయిన ప్రిన్సిపాల్ జీవన్‌కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాం అధ్యాపకులు శ్వేత, స్రవంతి, సువర్ణ దేవి, కిషోర్, హరిప్రసాద్, స్వప్న పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధించండి..

హుస్నాబాద్: విద్యార్థినులు కలలు కనండి, మంచి ఫలితాలు సాధించండి అని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శోభాదేవి అన్నారు. కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలలో ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు గత సంవత్సరం ఫలితాల కంటే అత్యధిక ఫలితాలు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లను తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలి: సురేశ్ బాబు



మాట్లాడుతున్న సురేశ్‌బాబు

సిద్దిపేటకమాన్: ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సురేశ్‌బాబు వైద్య సిబ్బందికి సూచించారు. ప్రభుత్వాసుపత్రిలో వైద్యాధికారులు, సిబ్బందితో శుక్రవారం నిర్వహించిన ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రోగుల భద్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని వారం రోజులుగా పేషెంట్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అన్ని విభాగాల వైద్యులు, ఆర్ఎంఓలు పాల్గొన్నారు.

కొమ్మూరి మానసిక పరిస్థితి బాగాలేదు

సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి మానసికస్థితి బాగాలేదని, అతనిని ఎర్రగడ్డ ఆసుపత్రికి పంపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి మండిపడ్డారు. కొమురవెల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా ఓడిపోయనప్పటికీ అధికార కార్యక్రమాలలో ఇంకా పాల్గొంటూనే ఉన్నారని, సొంత పార్టీ నాయకులే వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. ఓటమితో మానసిక స్థితిని కోల్పోయి ఆయన తోటి నాయకులను, ప్రజలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని వాపోయారు. చేర్యాలలో ఏడెకరాల భూదాన్ భూమిని అక్రమించారని, దానికితోడు కాలువ భూమిలో ఇంటి నిర్మాణం చేపట్టినట్లు ఆరోపించారు. అధికారులు ఆ ఇంటిని కూల్చివేయాలని డిమాండ్ చేశారు. సత్తిరెడ్డి, కృష్ణారెడ్డి, శారద తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **పీసీసీ చీఫ్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు**

కొమురవెల్లి(సిద్దిపేట): నూతన పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్‌ను జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కొమురవెల్లి మండల అధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, వజ్రోజు శంకరాచారి, కొమ్మురవి తదితరులు పాల్గొన్నారు.

◆ **ఓటరు జాబితాపై అభ్యంతరం**

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి గ్రామంతో సంబంధం లేని వారిని ఓటర్లుగా పేర్కొనడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ గ్రామానికి చెందిన యువకుడు రాజుపేట రంజిత్ పంచాయతీ కార్యదర్శికి అనర్హుల జాబితాను అందజేశారు. వార్డుల వారీగా ఓటర్ల లిస్టును ఇటీవల ఎన్నికల సంఘం ప్రకటించిన విషయం తెలిసిందే. అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 లోగా తెలపాలని సూచించింది. గ్రామ నాయకులు తమ రాజకీయ లబ్ధి కోసం మిట్టపల్లి బయటి ఓటర్లను జాబితాలో చేర్పించి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆ యువకుడు ఆరోపించారు.

◆ **విద్యార్థులకు వ్యవసాయ పాఠాలు**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను శుక్రవారం క్షేత్ర పర్యటనకు తీసుకువెళ్లారు. విద్యార్థులకు వ్యవసాయ పంటల సాగుపై అవగాహన కల్పించినట్లు హెచ్ఎం స్వరూప తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

◆ **మానవులకు మార్గదర్శకం**

హుస్నాబాద్: సామాజిక సంస్కర్త మహమ్మద్ జీవితం ముస్లింలకే కాకుండా మానవులందరికీ మార్గదర్శకమని ముస్లిం మతపెద్దలు కొనియాడారు. మిలాద్ ఉన్ నబీని పురస్కరించుకుని శుక్రవారం జామా మసీద్‌లో ఫాతేహా నిర్వహించి 500మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా మత గురువు రుహూల్ అమీన్ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త చేసిన త్యాగాలు అనుపమానమైనవన్నారు. కార్యక్రమంలో జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు బాషుమియా, ప్రధాన కార్యదర్శి ఎండీ హుస్సేన్, నాయకులు అయూబ్, ఫిసియోద్దీన్, దస్తగిరి, షబ్బీర్, ముంతాజ్, అషరఫ్, మహీర్, సోహిత్ తదితరులు ఉన్నారు.

◆ **ఇసుక లారీ పట్టివేత**

కోహెదరూరల్(హుస్నాబాద్): మండలంలోని శనిగరం శివారులో అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ఓ లారీని ఎస్ఐ అభిలాష్ శుక్రవారం పట్టుకున్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనిగరం పరిధిలోని శంకర్‌నగర్ నుంచి హైదరాబాద్‌కు ఇసుకను తరలిస్తున్నారని సమాచారం రావడంతో గ్రామ శివారులో ఆగి ఉన్న ఓ లారీని పోలీసులు పరిశీలించారు. ఇసుకను తరలించడానికి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో కేసు నమోదుచేసి లారీని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను రవాణాచేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

క్రీడలతో విద్యార్థులకు మంచి భవిష్యత్

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేటరూరల్: విద్యార్థులు చదవుతోపాటు క్రీడలతోను మంచి భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నారాయణరావుపేట మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం ఎస్‌జీఎఫ్ గేమ్స్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటల పోటీలు విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. గెలుపు ఓటములు సహజమని, ఓటమిని గెలుపుగా మార్చుకోవాలని సూచించారు. మొదటి రోజు క్రీడల్లో బాలికల అండర్ 14, అండర్ 17 విభాగంలో ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి యాదవరెడ్డి, హెచ్ఎం నాగరాజు, ఎస్‌జీఎఫ్ నారాయణరావుపేట్ మండల సెక్రెటరీ తోట సతీష్, వివిధ పాఠశాల పీఈటీలు సరస్వతి, రజిత, మహేష్, వెంకటేష్, నవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయి నుంచే నేర్చుకోవాలి

హుస్నాబాద్: పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో మెలకువలు నేర్చుకొని రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదగాలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత అన్నారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా 7, 18వ వార్డుల్లో చెత్త విభజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, ఎంఈఓ దేశిరెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్, పద్మ, రమేష్, క్రీడాకారులు లింగమూర్తి, మోహన్ రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం

అక్కన్నపేట(హుస్నాబాద్): క్రీడల్లో గెలుపు ఓటములను సహజంగా తీసుకోవాలని ఎంపీడీఓ భానోతు జయరాం అన్నారు. గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండలస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఎంపిక పోటీలను మూడు రోజులు నిర్వహించనున్నామని, ప్రతిభను కనబరిచిన విద్యార్థులను జిల్లాస్థాయికి ఎంపిక చేస్తారన్నారు. మండల నోడల్ అధికారి రంగానాయక్, హెచ్ఎం చంద్రశేఖర్, జ్యోతి, శంకర్‌నాయక్, తిరుపతి, వెంకటనర్సయ్య, ఓంప్రకాశ్, శ్రీరాం, కార్యదర్శి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా సాగిన క్రీడలు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్లో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో రెండో రోజున మండల స్థాయి క్రీడలు హోరాహోరీగా సాగాయి. కబడ్డీ, ఖోఖో సీనియర్ బాలురు, బాలికల విభాగం విద్యార్థులకు క్రీడలు ముగిశాయి. కబడ్డీలో బాలికల సీనియర్ విభాగంలో చిన్న కిష్టాపూర్, కుకునూరుపల్లి హైస్కూల్ విద్యార్థులు తలపడ్డారు. దాత పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు నరేందర్, ఎస్‌జీఎఫ్ అసోసియేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హుస్నాబాద్: కబడ్డీ పోటీల్లో తలపడుతున్న చైర్‌పర్సన్ రజిత, వైస్ చైర్‌పర్సన్ అనిత



అక్కన్నపేట(హుస్నాబాద్): ఖోఖో ఆడుతున్న విద్యార్థినులు



కొండపాక(గజ్వేల్): కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు



దుబ్బాకటౌన్: పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మండల ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. అండర్ -14, అండర్-17 విభాగాల్లో బాలబాలికలు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షాట్‌పుట్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులను అందజేశారు. పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలను ఎంపిక చేసి జిల్లా స్థాయిలో జరిగే ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు పంపించనున్నారు. అలాగే మద్దూరు మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి.

ఎమ్మార్వోకు సన్మానం

దౌల్తాబాద్(దుబ్బాక): మండలానికి నూతనంగా వచ్చిన ఎమ్మార్వో పి.చంద్రశేఖర్‌రావును మండల రేషన్ డీలర్లు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం అధ్యక్షుడు ఎ.లక్ష్మణ్, వి.మల్లేషం, ఎ.శేఖర్‌రెడ్డి, సాయిలు, మొగులయ్య, భూషణం, లక్ష్మణ్, అన్నపూర్ణ తదితరులు కలిసి శాలువాతో సత్కరించారు.

ఉత్సాహంగా 'హరిత శుక్రవారం'



సిద్దిపేటజోన్: మొక్కలకు నీరు పడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: సిద్దిపేట మున్సిపాలిటీలో శుక్రవారం అధికారులు స్వచ్ఛతాహీ సేవలో భాగంగా 'హరిత శుక్రవారం' నిర్వహించారు. స్థానిక గాంధీ పార్క్‌లో మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ మొక్కలకు నీరు పట్టారు. పార్క్‌లోని మొక్కల చుట్టూ ఉన్న చెత్తాచెదారం తొలగించారు. ఈ సందర్భంగా అధికారులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు వనిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు స్వచ్ఛ్‌భారత్

సిద్దిపేటకమాన్: పర్యావరణ పరిరక్షణ కోసం స్వచ్ఛ్ భారత్ నిర్వహిస్తున్నామని వన్‌టౌన్ సీఐ లక్ష్మీబాబు చెప్పారు. పోలీసు స్టేషన్ ఆవరణలో పోలీసు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది శుక్రవారం స్వచ్ఛ్ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలోని పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించారు. పీఎస్ పరిసర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సర్వైకల్ క్యాన్సర్‌పై అవగాహన అవసరం



మహిళలకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సిద్దిపేటఅర్బన్: ఆధునిక జీవన శైలి వల్ల మహిళలు ఎక్కువగా సర్వైకల్ క్యాన్సర్ బారిన పడుతున్నారని, దీనిపై అవగాహన పెంచుకొని ముందస్తుగా టీకాలు వేయించుకోవడం ద్వారా దాని బారి నుంచి తప్పించుకోవచ్చని సురభి వైద్య కళాశాల ఆస్పత్రి గైనకాలజీ విభాగం అధిపతి తొగరికర్, ప్రొఫెసర్ మంజుకుమారి అన్నారు. ప్రపంచ గర్భాశయ, అండాశయ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆస్పత్రిలో మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్లు మాట్లాడుతూ తొమ్మిదేళ్ల పైబడిన బాలికలు మొదలుకొని మహిళలు సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించిన టీకాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రాంప్రసాద్, శివరామాచారి, శివలత, సౌజన్య, దివ్య, జలపతినాయక్, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.